సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 11 | జనవరి | 2023



కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్

త్వరలోనే మంత్రి కేటీఆర్ చేత కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేయిస్తామని మంత్రి దయాకర్‌రావు అన్నారు.

- 8లో



దరఖాస్తుల ఆహ్వానం

టీజీయూజీఎస్‌ఈటీ-23 ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ కార్యదర్శి విద్యారాణి తెలిపారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
29.0°/13.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వీసీకి వినతి



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో అన్ని అర్హతలతో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకులకు పీజీ, ఎంకామ్, ఎంబీఏ పరీక్షల జవాబుపత్రాల వాల్యుయేషన్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ వీసీ తాటికొండ రమేశ్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు బైరి నిరంజన్ మాట్లాడుతూ కామర్స్ విభాగంలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి వాల్యుయేషన్ చేయడానికి అనుమతి ఇవ్వడం లేదన్నారు. కామర్స్ విభాగంలో ఐదుగురు అధ్యాపకులే ఉండడం వల్ల వాల్యుయేషన్ ఆలస్యమవుతుందని, వెంటనే తమకు అవకాశం కల్పించాలని కోరారు.

యువజనోత్సవాలకు కాళోజీ వర్సిటీ విద్యార్థులు



షకీబ్ అబ్దుల్ రఫీ, విఘ్నేష్‌గౌడ్, హారిక, హర్షిణి

ఎంజీఎం: కర్ణాటకలోని హుబ్లీలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి యువజనోత్సవాలకు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ తరఫున ఎంపికైన షకీబ్ అబ్దుల్ రఫీ, జూలూరి విఘ్నేష్‌గౌడ్, రాయికంటి హారిక, సీర్ల హర్షిణి మంగళవారం తరలివెళ్లారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ మంత్రి ఠాకూర్‌సింగ్ హాజరు కానున్నారు. కాగా.. యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులను కో ఆర్డినేటర్ రాంకుమార్‌రెడ్డి, వీసీ డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి, రెక్టార్ డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రవీణ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం అభినందించారు.

ఆయుర్వేద కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విజయ్



కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయ్ గణేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ బూర్గుల రామకృష్ణారావు (డాక్టర్ బీఆర్‌కేఆర్) ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనను గత నెల 24న రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి.. వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పంపించారు. అయితే హైదరాబాద్‌లోనే ఉండేందుకు ప్రయత్నించినా.. ఫలించకపోవడతో ఇక్కడి జిల్లా అధికారుల ఒత్తిడి మేరకు మంగళవారం ఆయుర్వేద కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవీందర్ గౌడ్.. ఇకనుంచి పాత స్థానంలోనే ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు. కాగా.. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తదితరులు విజయ్ గణేశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

21మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో మంగళవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర పరీక్షల్లో వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 21 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

పోర్ట్ ఫోలియో జడ్జిల నియామకం

వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు పోర్ట్‌ఫోలియో జడ్జిలను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిని, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు జస్టిస్ ఎం.తుకారాంజీని పోర్ట్‌ఫోలియో జడ్జిలుగా నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

11 రోజులు సెలవులొద్దు..!

సోలార్ బిగింపు పనులు పూర్తి చేయాలి

వీసీ, రిజిస్ట్రార్ కక్ష సాధింపు చర్యలు

- 10లో



లైసెన్స్..

'లైసెన్స్ లేకుండా రోడ్లపై వాహనాలు నడుపుతూ పట్టుబడితే వెంటనే సీజ్ చేస్తాం. సదరు వాహనదారుడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తాం' అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించిన విషయం విదితమే. ఇంకేముంది లైసెన్స్ లేని వాహనదారులందరూ ఆయన మాటలు పెడచెవిన పెట్టకుండా శ్రద్ధగా ఆర్టీఏ కార్యాలయానికి లైన్ కట్టారు. చింతగట్టు క్యాంప్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి.. ఇలా 105 మంది లెర్నింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. - హసన్‌పర్తి

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి

న్యాయమూర్తి పద్మజారెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పద్మజారెడ్డి, పక్కన ఏసీ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: మహిళా ఉద్యోగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని న్యాయమూర్తి పద్మజారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో ఎలా మెలగాలో ఆడపిల్లలకు నేర్పించాలని సూచించారు. వారి ఆత్మరక్షణకు అవసరమైన విద్యలు నేర్పించాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐడీఓసీ మహిళా ఉద్యోగుల కమిటీని ప్రకటించారు. డీసీఓ నీరజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

● సీపీగారూ..

జర.. సీగ్నల్!

ట్రై సిటీస్‌లో పూర్తిస్థాయిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

- మొత్తం ఉన్నవి 23.. పనిచేసేవి 12 మాత్రమే
- మిగిలిన 11 జంక్షన్లలోనూ పనిచేసేలా చూడాలంటున్న జనం
- రద్దీ నియంత్రణకు మరో 35 చోట్ల అవసరం
- సీపీ రంగనాథ్‌కు చేరిన సమగ్ర నివేదిక
- బల్దియా నిర్వహణలోపంతో వాహనదారులకు తిప్పలు



గుండ్ల సింగారం దబ్బాల జంక్షన్ వద్ద ఏర్పాటు చేయని ట్రాఫిక్ సిగ్నల్



వరంగల్ వెంకట్రామ జంక్షన్ వద్ద పని చేయని సిగ్నల్

సాక్షి, వరంగల్: రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలంటే ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు రూల్స్ పాటించేలా మార్పు తీసుకురావాలి. ఇదంతా చేయాలంటే రద్దీచోట్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయాలి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని ట్రైసిటీస్‌లో ప్రస్తుతం 23 ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండగా.. 12 చోట్ల పనిచేస్తున్నాయి. మిగతా 11 పనిచేయడం లేదని ట్రాఫిక్ పోలీసుల నివేదిక చెబుతోంది. కరోనా తర్వాత వ్యక్తిగత వాహనాలు పెరగడంతో సిటీలో రాకపోకలు భారీగా పెరిగాయి. వీటి నియంత్రణకు 35 ట్రాఫిక్ సిగ్నల్స్ కావాలని వారి అధ్యయనంలో తేలింది. ఉన్నవాటిలోనే సగానికి సగం నిర్వహణను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) సరిగా చూడలేకపోతుందున్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, కాంట్రాక్ట్ పనులపై ఉన్న శ్రద్ధ జనాలకు ఉపయోగపడే ఈ ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు, నిర్వహణపై లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రద్దీకి అనుకూలంగా సిగ్నల్స్ కావాలి..

వరంగల్, హనుమకొండతోపాటు ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల వాసులు గ్రేటర్ వరంగల్‌కు వివిధ పనులపై ప్రజా రవాణా వాహనాలు, వ్యక్తిగత వాహనాలపై వచ్చి వెళ్తుంటారు. నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, కమలాపూర్, గీసుకొండ, ఆరెపల్లి, దామెర, గుడెప్పాడ్, మామునూరు తదితర ప్రాంతాలనుంచి వివిధ పనులు, కాలేజీలకు చదువుకునేందుకు ఎక్కువగా వచ్చి పోతుంటారు. వరంగల్, కాజీపేటలో ప్రధాన రైల్వే స్టేషన్‌లు ఉండడంతో ప్రయాణికుల రాకపోకలు అదనంగా ఉంటాయి. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల మధ్యలో, సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల మధ్యలో ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ జామవుతుంటుంది. ఉన్న 23చోట్ల అన్నింటినీ పనిచేయించడంతోపాటు కొత్తగా ప్రతిపాదించిన ప్రాంతాల్లోనూ దశలవారీగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేయడం వల్ల వాహనదారులకు క్రమశిక్షణ అలవర్చి ప్రమాదాలు తగ్గించే ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు.

వరంగల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో..

- ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేవి

ఎంజీఎం జంక్షన్, పోచమ్మమైదాన్ జంక్షన్, గవిచర్ల క్రాస్ రోడ్డు

- పనిచేయనివి

వరంగల్ చౌరస్తా, బూదిదగడ్డ జంక్షన్, హెడ్ పోస్టాఫీస్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్

- అందుబాటులో లేనివి

దేశాయ్‌పేట (80 ఫీట్ల రోడ్డు), రైల్వేస్టేషన్, పార్కింగ్ ఆర్‌ఎస్‌టీ రోడ్డు పెట్రోలింగ్, దుర్గేశ్వర టెంపుల్ జంక్షన్, బీట్‌బజార్ పెట్రోలింగ్, బట్టల బజార్ బ్రిడ్జ్, రాజు స్వీట్ హౌస్ (బజార్), ఫోర్ట్ రోడ్డు డైవర్షన్, తెలంగాణ డైవర్షన్, జెమినీ డైవర్షన్, పోతన జంక్షన్, ఉర్సుగుట్ట డైవర్షన్, హనుమాన్ జంక్షన్.

కాజీపేట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో..

- ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేవి

గోకుల్ జంక్షన్, అదాలత్ జంక్షన్, వడ్డెపల్లి ఎక్స్‌రోడ్డు, కాజీపేట చౌరస్తా, కడిపికొండ బ్రిడ్జి

- పనిచేయనివి

మదర్ థెరిస్సా జంక్షన్, కలెక్టర్ రెసిడెన్సీ

- అందుబాటులో లేనివి

కాళోజీ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ 1, 2, వడ్డెపల్లి చర్చి, శ్రీరామ్‌రెడ్డి హాస్పిటల్, సీఎస్‌ఆర్ గార్డెన్, జులైవాడ క్రాస్‌రోడ్డు, ఏ టూ జెడ్ మెడికల్ హాల్, బంధం చెరువు, ఫాతిమా బస్టాప్, ఎఫ్‌సీఐ గోడౌన్, శాయంపేట ఎక్స్ రోడ్డు.



కాశిబుగ్గ జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్.. అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనదారులు

హనుమకొండ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో..

- ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేవి

సీపీఓ జంక్షన్, కేయూసీ క్రాస్ రోడ్డు జంక్షన్, అశోకా, ములుగు రోడ్డు జంక్షన్

- పనిచేయనివి

అలంకార్, మర్కాజీ జంక్షన్, పెద్దమ్మగడ్డ, అమృత జంక్షన్

- అందుబాటులో లేనివి

చింతగట్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి, నయీంనగర్, రంగ్‌బార్, సీపీ సర్ రెసిడెన్సి గేట్, బస్టాండ్ జంక్షన్, చౌరస్తా పెట్రోలింగ్, హనుమకొండ చౌరస్తా జంక్షన్, పెగడపల్లి డబ్బాల జంక్షన్.

సిగ్నల్స్ ఉంటే క్రమశిక్షణ

చాలా జంక్షన్లలో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన పోతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా పట్టించుకోకుండా దూసుకెళుతున్నారు. ఫలితంగా ప్రమాదాలు జరిగే అస్కారం ఉంది. వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పెంచాలి.

- జి.మురళి, వాహనదారుడు

దశలవారీగా సిగ్నల్స్ క్రమబద్ధీకరణ

ఇప్పటికే బల్దియా అధికారులతో ట్రాఫిక్ జంక్షన్ల నిర్వహణపై సమీక్షించాం. ప్రస్తుతమున్న అని సిగ్నల్స్ పనిచేసేలా ముఖ్యంగా టైమింగ్ పనిచేసేలా చూడాలన్నాం. స్టాప్‌లైన్స్ కూడా పెయింటింగ్ వేయాలన్నాం. వాహన రద్దీకి అనుగుణంగా ప్రతిపాదిత ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు దశలవారీగా చేపట్టాలని నిర్ణయించాం.

-ఏవీ రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

వంద కేంద్రాల్లో 'కంటి వెలుగు'

గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: నగర పరిధిలోని 100 కేంద్రాల్లో 37 వైద్య బృందాల ద్వారా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ల సహకారంతో ప్రజల సౌకర్యార్థం గుర్తించిన శిబిరాల్లో అవసరమైన సామగ్రి వెంటనే సమకూర్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద షామియానాలు, మరుగుదొడ్లు, మంచినీరు, నిరంతర విద్యుత్, సీటింగ్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 18 నుంచి జూన్ చివరి వరకు కార్యక్రమం జరగనున్న దృష్ట్యా కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం పక్కాగా జరగాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, సెక్రటరీ విజయలక్ష్మి, ఎస్‌ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, ఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈలు సంజయ్‌కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో బస్ స్టేషన్

- నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం..
- వరంగల్ కలెక్టర్ గోపి, ఎమ్మెల్యే నరేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్. పక్కన కలెక్టర్ గోపి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను అత్యాధునిక హంగులతో నిర్మిస్తామని వరంగల్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం బస్ టెర్మినల్ నిర్మాణ స్థలాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కమిషనర్ ప్రావీణ్య.. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు మోడ్రనైజింగ్ బస్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైందన్నారు. నాలుగు వారాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ బస్ స్టేషన్ నిర్మాణానికి సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌లు రూ.75కోట్లు కేటాయించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డిజైన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. కుడా చైర్మన్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నిర్మాణం ఉంటుందన్నారు. కమిషనర్ ప్రావీణ్య మాట్లాడుతూ పాత బస్ స్టేషన్‌ను తొలగించి.. తాత్కాలికంగా ఎస్‌ఎన్‌ఎం క్లబ్, రైల్వే స్టేషన్ మధ్యగల స్థలాన్ని బస్టాండ్ కోసం వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత, బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న, ఈఈలు భీమ్‌రావు, శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'కళాక్షేత్రం' జూన్ 2లోగా పూర్తి కావాలి



కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో వేగం పెంచి.. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్యలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు తెచ్చే విధంగా వేదికను నిర్మించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కళాక్షేత్ర నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ఇటీవలే మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించడం వల్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య మాట్లాడుతూ కళాక్షేత్రం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.73కోట్లు కేటాయించిందని, ఇందులో మొదటి విడతగా మంజూరైన రూ.23కోట్లతో సివిల్ వర్క్స్ జరిగాయని, రెండో విడతగా మంజూరైన రూ.40 కోట్లతో ఇంటీరియర్ డిజైనింగ్ ఫినిషింగ్ పనులు చేపడతామన్నారు. కుడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, హార్టికల్చర్ ఆఫీసర్ వేణుగోపాల్, టూరిజం అధికారి శివాజీ, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అందుబాటులో ఉంటా..

హన్మకొండ చౌరస్తా: పెన్షనర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కాకాజీ కాలనీలోని ఎస్‌ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఇ.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హనుమకొండ ట్రెజరీ డీడీ రాజు, ఏటీఓలు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: జిల్లాలో అక్రమంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్న ఆస్పత్రులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం అమలు తీరు, చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, పీహెచ్‌సీలవారీగా ఆడపిల్లల జననాలపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మాయిల జననాలు తక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో కళాజాతా ద్వారా, మహిళా సమాఖ్య సభ్యుల సమావేశాలు జరిగినప్పుడు వారికి పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. న్యాయమూర్తి పద్మజ మాట్లాడుతూ జిల్లాలో ఇన్‌స్పెక్షన్ టీమ్‌లను పెంచాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా, ఏసీపీ స్పెషల్ బ్రాంచ్ అబ్దుల్ రెహమాన్, ఎన్జీఓ ఆర్.కృష్ణమూర్తి, ఎల్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే వ్యాగన్ యూనిట్‌కు మోక్షం

- 19న ప్రధాని మోదీ రిమోట్‌తో భూమిపూజ
- అయోధ్యపురంలో 155 ఎకరాల్లో రూ.521 కోట్లతో నిర్మాణం

ఫలిస్తున్న 12 ఏళ్ల కల!

కాజీపేట రూరల్: కాజీపేటకు కేటాయించిన రైల్వే వ్యాగన్ పిరియాడికల్ ఒవరాలింగ్ వర్క్‌షాప్ ప్రాజెక్ట్ నిర్మాణం కల 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత నెరవేరబోతోంది. జనవరి 19వ తేదీన హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ.. ఈ ప్రాజెక్ట్‌కు రిమోట్ ద్వారా భూమిపూజ చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు భూమి పూజ ఏర్పాట్లలో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. కాజీపేట వ్యాగన్ మంజూరు తర్వాత మంజూరైన కర్ణాటకలోని యాద్గిరిలో లాఫ్ అఫ్ బుష్ యూనిట్, రాయ్‌బరేలిలో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయి ఉత్పత్తి కూడా జరుగుతోంది.

పుష్కర కాలం తరువాత..

2009–2010 రైల్వే బడ్జెట్‌లో నాటి రైల్వేమంత్రి మమత బెనర్జీ సికింద్రాబాద్ డివిజన్‌కు రూ.200 కోట్ల వ్యయంతో వ్యాగన్‌ల తయారీ పరిశ్రమను పీపీపీ విధానంలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సికింద్రాబాద్ డివిజన్‌కు కేటాయించిన వ్యాగన్‌ను కాజీపేటలో నిర్మాణం చేపట్టేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో జంక్షన్ సమీప గ్రామాలైన అయోధ్యపురం, కుమ్మరిగూడెం, కడిపికొండ, మడికొండ గ్రామాల శివారు పరిధిలో భూమి సర్వే చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం నేపథ్యంలో కొంతకాలం బ్రేక్ పడింది. తర్వాత 2016–2017 రైల్వే బడ్జెట్‌లో నాటి రైల్వే మంత్రి సదానంద గౌడ కాజీపేట వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ స్థానంలో వ్యాగన్ పిరియాడికల్ ఒవరాలింగ్ వర్క్‌షాప్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వ్యాగన్ వర్క్‌షాప్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. దశల వారీగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ఇటు జిల్లా అధికారులు, ఇటు రాజకీయపార్టీల ఒత్తిళ్లతో ఎట్టకేలకు వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. దీంతో అయోధ్యపురంలో 155 ఎకరాల విస్తీర్ణంలో రూ.521 కోట్ల వ్యయంతో అతిపెద్ద రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ రిమోట్ ద్వారా భూమిపూజ, శంకుస్థాపన చేయనున్నారు.

1984నుంచి ఉద్యమాలు

కాజీపేటకు రైల్వే పరిశ్రమలు రావాలని, ఇక్కడి నిరుద్యోగం తీరాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జిల్లా ప్రజలు ఉద్యమాలు చేశారు. 1984లో కాజీపేటకు మంజూరైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చినట్టే వచ్చి పంజాబ్‌లోని కపుర్తాలకు తరలిపోయింది. అప్పటినుంచి నేటి వ్యాగన్ వరకు కాజీపేట ఎలాంటి రైల్వే పరిశ్రమకు నోచుకోలేదు. దాదాపు 39 ఏళ్ల తర్వాత కాజీపేటలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌నకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.



అయోధ్యపురం వద్ద రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణం చేపట్టనున్న భూమి ఇదే

ప్రాజెక్టు వల్ల లాభాలు

- ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి 18 నెలలకు ఒకసారి రైల్వేవ్యాగన్ వచ్చి మెయింటనెన్స్ చెక్ చేసుకుంటుంది.
- కాజీపేట పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పుతారు.
- సుమారు ఆర్‌ఆర్‌బీ ద్వారా 5వేల మంది ఉపాధి కలుగుతుంది.
- పరోక్షంగా సుమారు 5వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇక కాజీపేట డివిజన్, కోచ్ ఫ్యాక్టరే

వ్యాగన్ వర్క్‌షాప్ తర్వాత కాజీపేట రైల్వే డివిజన్ కేంద్రం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రాజకీయ పార్టీలకతీతంగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రజలు అంటున్నారు. ఒక రైల్వే డివిజన్ కేంద్రానికి ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్న కాజీపేటకు ఉన్నాయని, అదేవిధంగా కాజీపేటకు కేటాయించి.. తరలిన కోచ్‌ఫ్యాక్టరీ తిరిగి మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వరంగల్ మీదుగా వందేభారత్ రైలు

19వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ సికింద్రాబాద్–విశాఖపట్నానికి వరంగల్ మీదుగా వందేభారత్ రైలును ప్రారంభించనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట, వరంగల్ మీదుగా తొలి వందేబారత్ రైలు ప్రధాని ప్రారంభంతో జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానుంది.

క్లుప్తంగా

పోక్సో కేసులో అన్నదమ్ముల అరెస్ట్?

ఖిలా వరంగల్: బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన వరంగల్ నర్సంపేట రోడ్డులోని దయానంద్‌కాలనీకి చెందిన అన్నదమ్ములు ఎండి అజ్మత్ అలీ, అక్బర్ అలీని పోక్సో కేసులో మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. కాగా, ఈ కేసు విషయంలో మొదటి నుంచి పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారించినట్లు సమాచారం. సోమవారం సాయంత్రం వరంగల్ మట్టేవాడలోని ఏసీపీ కార్యాలయంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ కల్కోట్ల గిరికుమార్ కేసు వివరాలు చర్చించినట్లు తెలిసింది.

హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు

రామన్నపేట: వరంగల్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం(కన్జూమర్ ఫోరం) కమిటీ, ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి భారతి ఆధ్వర్యంలో సిబ్బంది వరంగల్, హనుమకొండలోని హోటళ్లు, రెస్టారెంట్లు, హోల్‌సేల్ కిరాణషాపులు, బేకరీల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్టులు వచ్చిన తర్వాత హోటళ్లు, రెస్టారెట్లపై చర్యలు తీసుకుంటామని భారతి తెలిపారు. ఆహార కల్తీ నిరోధక చట్టానికి సంబంధించిన(ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ పొంది ఉండాలని, కార్మికులు శుభ్రత పాటించాలని లేదంటే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్జుమర్ ఫోరం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు వసంత, రవీందర్, శ్రీనివాస్‌రావు, సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

వరంగల్ క్రైం : హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జడ్జి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. కరీంనగర్‌కు చెందిన తూర్పాటి రవి, పంతినికి చెందిన ఉప్పరి రాజు, నందనంకు చెందిన మాలోత్ భాస్కర్, మైలారం గ్రామానికి చెందిన ఓర్సు రాంబాబు మద్యం తాగి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో కోర్టులో హాజరుపరచగా వారికి రెండు రోజుల పాటు జైలు శిక్ష పడింది. అలాగే, మరో ఐదుగురికి రూ.13,500 జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఐటీకోర్ సిబ్బందికి ప్రశంస పత్రాలు



కాజీపేట: విధి నిర్వాహణలో రాణించే సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఐటీ అప్లికేషన్ల వినియోగంలో ప్రతిభ కనబర్చిన ఐటీ కోర్ సిబ్బందికి సీపీ కార్యాలయంలో మంగళవారం ప్రశంస పత్రాలు అందజేశారు. డీజీపీ కార్యాలయం ఐటీ కోర్ సిబ్బందిని ఎంపిక చేయగా హెచ్‌సీలు వి.మాధవరావు, ఎండి అన్వర్, పీసీలు పి.రాజేందర్, కె.శ్రావణ్‌కుమార్, ప్రవీన్‌కుమార్‌కు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు.

కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

- హాజరైన జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్యే రాజయ్య

భీమదేవరపల్లి: కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి, అమ్మవారల కల్యాణం మంగళవారం కమనీయంగా సాగింది. తొలుత ఆలయంలో అర్చకులు ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారలకు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం లోక కల్యాణార్థం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారల ఉత్సవమూర్తులను అలంకరించి మేళతాళాల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా.. వేదోత్తములైన ఆగమ పండితులు, యాగ్నికులచే కల్యా



కల్యాణం జరిపిస్తున్న యాగ్నికులు

ణోత్సవాన్ని మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. కాగా.. వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలను తిలకించేందుకు వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి,



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్‌రావు, సర్పంచ్ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, అర్చకులు కంచనపల్లి రాజన్న, మొగిలిపాలెం రాంబాబు, మాజీ చైర్మన్లు మార్పాటి మహేందర్‌రెడ్డి, పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’ ఎత్తివేతకు కుట్ర

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

హన్మకొండ: ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆరోపించారు. ఉపాధిహామీ చట్టం పరిరక్షణ ఉద్యమంలో భాగంగా మంగళవారం హనుమకొండలో ఉపాధిహామీ హక్కుల పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగారుస్తూ కూలీలకు పని కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కూలీలకు రూ.10వేల కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉండగా.. తెలంగాణ రాష్ట్రంలో కూలీలకు రూ.1,425కోట్లు చెల్లించకుండా కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయడంతోపాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను రోజుకు రూ.800లకు పెంచాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, కూలీలకు



సదస్సులో మాట్లాడుతున్న శంకర్

బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిరోజు నుంచి మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వరకు ఉపాధిహామీ చట్టం పరిరక్షణ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, జిల్లా కార్యదర్శులు పసుల దాసు, మేకల అనిత, సిలువేరు వనశ్రీ, రాధ, శశికళ, వినోద, మమత, భాగ్య, సరిత, అశోక్, శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.

మల్లికార్జున్ కుటుంబానికి అండగా ఉంటాం..

- కుటుంబ బాధ్యత పార్టీదే.. ఇంట్లో ఒకరికి ఉద్యోగం
- ఫోన్‌లో పరామర్శించిన మంత్రి కేటీఆర్

ములుగు రూరల్ (గోవిందరావుపేట): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గజ్జి మల్లికార్జున్ గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ బాధిత కుటుంబాన్ని మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ బాధ్యత పార్టీదేనని, పిల్లలకు చదువుతో పాటు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డితో కలిసి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



మల్లికార్జున్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ జగదీష్

కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మండల అధ్యక్షుడు సురపనేని సాయిబాబా, ప్రధాన కార్యదర్శి లకావత్ నర్సింహనాయక్, నాయకులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

వాజేడు: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి కడతేర్చింది ఓ భార్య. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పేరూరుకు చెందిన గొడ్డె బసవయ్య(బాబు)కు సుమారు 18 ఏళ్ల క్రితం సుజాతతో వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు కలిగారు. ఈ క్రమంలో సుజాత.. అదే



గొడ్డె బసవయ్య (ఫైల్)



హత్యకు గురైన బసవయ్య(బాబు) మృతదేహం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

గ్రామానికి చెందిన పెండికట్ల దర్శన్‌బాబుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలిసిన బసవయ్య... భార్యను మందలించాడు. అయినా ఆమె తీరు మారక పోవడంతో గ్రామ పెద్దల సమక్షంలో ఇటీవల పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. భర్తతో బుద్ధిగా కాపురం చేసుకుంటానని చెప్పిన సుజాత.. మళ్లీ ప్రియుడి మోజులో పడి తన వివాహేతర సంబంధాన్ని కొనసాగించింది. వీరి సంబంధానికి బసవయ్య అడ్డమని భావించిన సుజాత.. ప్రియుడు దర్శన్‌బాబుతో కలిసి సోమవారం రాత్రి బసవయ్య గొంతు నులిమి చంపింది. మంగళవారం ఉదయం విషయం వెలుగుచూడడంతో వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి బావమర్ది గోట లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరీష్ తెలిపారు. ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

సరికొత్త మోసం

- తక్కువ ధరకే 15 లీటర్ల ఫ్రీడం ఆయిల్ డబ్బా
- ఓపెన్ చేస్తే అంతా నీరే
- లబోదిబోమంటున్న బాధితులు

ఖిలా వరంగల్: సంక్రాంతి పర్వదినం.. ఇంటింటా పిండి వంటలు మొదలయ్యాయి. ఇదే అదను అని భావించిన దోపిడి ముఠా సరికొత్త మోసానికి తెరలేపింది. తక్కువ ధరకే ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బా అందజేస్తామని నమ్మించి మోసం చేసింది. ఈ సంఘటన మంగళవారం వరంగల్ రంగశాయిపేటలోని బక్కివాడ, యాదవవాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. బక్కివాడ, యాదవవాడలో సోమవారం ఇద్దరు వ్యక్తులు వాహనాలపై సంచరిస్తూ 15 లీటర్ల ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బా రూ.1,500కే విక్రయిస్తున్నామని.. నేరుగా కంపెనీ నుంచి తెప్పించామని



నీరు వచ్చిన ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బాలు ఇవే..

నమ్మబలికారు. దీంతో నమ్మిన స్థానికులు వారి నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ డబ్బాలు కొనుగోలు చేశారు. తీరా డబ్బా ఓపెన్ చేసి చూస్తే దానిలో నీళ్లు ఉన్నాయి. కింద నీళ్లు పోసి పైభాగాన కొద్దిగా నూనె పోసి మోసం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

కేవీకేను సందర్శించిన ములుగు అదనపు కలెక్టర్



వర్మి కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నాగపద్మజ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ములుగు అదనపు కలెక్టర్ నాగపద్మజ, ఆర్‌డీఏ పీడీ వెంకటనారాయణ మంగళవారం సందర్శించారు. కేవీకే ప్రాంగణంలోని అజోల్ల యూనిట్, వర్మి కంపోస్ట్, న్యూట్రీ గార్డెన్, రాజశ్రీకోళ్ల యూనిట్, చేపల చెరువును పరిశీలించారు. ములుగు జిల్లాలో 100 రోజుల పనిచేస్తున్న లబ్ధిదారులకు ఉన్నతి పథకం కింద శిక్షణ ఇప్పించడం గురించి చర్చించారు. కేవీకే చేపట్టిన విస్తరణ కార్యక్రమాలను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజన్న వారికి వివరించారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు, ములుగు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాకారుల సొమ్ము కాజేతపై విచారణ

- రూ.50లక్షల వరకు మాయం చేసినట్లు ప్రాథమిక అంచనా

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేసే ఉద్యోగి జిల్లాలోని కళాకారులకు అందాల్సిన రూ.లక్షలు కాజేసిన ఘటనపై విచారణ ప్రారంభమైంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు కళాకారులు గతంలో ఇచ్చిన ఫిర్యాదుతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసిన కలెక్టర్ ఘటనపై విచారణ అధికారిగా డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్‌ను నియమించారు. విచారణలో భాగంగా ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ కార్యాలయంలో కళాకారులు, పలు మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వివిధ దేవాలయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులు, కళాజాతలతో కార్యాక్రమాలు నిర్వహించగా



కళాకారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఇతర అధికారులు

వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా డీపీఆర్వో కార్యాలయ ఉద్యోగి కాజేసినట్లు తేలింది. ప్రస్తుతం జరుగుతున్న విచారణలో సమారు రూ.50లక్షల వరకు ఈ విధంగా ఉద్యోగి మింగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

టీజీయూజీఎస్ఈటీ ఎంట్రెన్స్‌కు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీయూజీఎస్ఈటీ - 2023 ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ కార్యదర్శి ఎస్.విద్యారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేతుల మీదుగా ఎంట్రన్స్ పరీక్ష ఫ్లెయిర్ ఆవిష్కరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన డిగ్రీ కళాశాలలో ఎంతో మంది పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఆర్‌సీఓ ఎస్.విద్యారాణి మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో http://tswreis.in, http://www.tgtwgurukulam.telangana.gov.in



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ ప్రిన్సిపాళ్లు టి.భద్రకాళి, పి.వింధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ టి.సాంబలక్ష్మి పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీసులు

మామునూరు: మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖమ్మం మీదుగా వరంగల్ నగరానికి వాహనంలో తరలిస్తున్న 28 ప్యాకెట్ల ఎండు గంజాయిని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించనున్నట్లు తెలిసింది.

యాసిడ్ దాడి చేస్తే పదేళ్ల జైలు

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావు

వరంగల్ చౌరస్తా: మహిళలపై యాసిడ్ దాడి పెద్ద నేరమని.. యాసిడ్ దాడి చేసిన నిందితులకు కనీసం పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యచరణలో భాగంగా వరంగల్ కృష్ణకాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాసిడ్ దాడి - న్యాయ సాయం అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై యాసిడ్, పెట్రోల్ దాడులు అత్యంత కిరాతకం, క్రూరమైన నేరాలన్నారు. ఈ మేరకు విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యాసిడ్ దాడి బాధితులకు వైద్యం కోసం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ.3 లక్షల



సదస్సులో మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

నుంచి రూ.8లక్షల వరకు పరిహారం కింద అందజేయడం జరుగుతుందని చెప్పారు. బాధితులకు న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. అనంతనం న్యాయ సేవాధికార సంస్థల విధి, విధానాలు, ఉచిత న్యాయ సాయం, చట్టాలపై కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు





జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న భద్రకాళి శేషు, సంగీత కచేరి

హన్మకొండ కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హనుమకొండలోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలు, భారతీయ సంగీత శాస్త్రవేత్త పండిట్ శ్రీవిష్ణు నారాయణ్ భాత్‌ఖండే, హిందూస్థానీ సంగీత విద్యాంసుడు పండిట్ శ్రీవిష్ణుదిగంబర్ పలూస్కర్ జయంతోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భద్రకాళి దేవాలయం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత, నృత్య విద్యను నేర్చుకోవడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. ప్రముఖ కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసుడు వాసా గోపినాథ్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, కళాకారులు త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గోష్ఠి గానం నిర్వహించారు. అనంతరం అతిథులు, కళాకారులకు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ ఎస్సై మృతి



యాదవరెడ్డి (ఫైల్)

కాజీపేట: ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న గంజి యాదవరెడ్డి(52) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ములుగులో విధులు ముగించుకుని హనుమకొండ బస్టాండుకు చేరుకున్న ఆయన ద్విచక్రవాహనంపై రాంనగర్‌లోని ఇంటికి వెళ్తుండగా ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిచారు. సుబేదారి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మొక్కజొన్న, పత్తి పంటల పరిశీలన

ఖిలా వరంగల్: స్తంభంపెల్లి, వసంతాపురం గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను జిల్లా వ్యవసాయాధికారి డి.ఉషాదయాళ్ మంగళవారం పరిశీలించారు. మొక్కజొన్న, పత్తి అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే యాసంగి సీజన్‌లో వరిలో ఉధృతమవుతున్న కాండం తొలిచే పురుగు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎన్ఎఫ్ఎస్ఎం కోఆర్డినేటర్ సారంగపాణి, ఏఓ విజ్ఞాన్, ఏఈఓ చంద్రకాంత్, గ్రామ కమిటీ కోఆర్డినేటర్లు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్ల నియామకం

హన్మకొండ: బీజేపీ లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్‌గా తాళ్లపల్లి కుమారస్వామి (హనుమకొండ), జాయింట్ కో కన్వీనర్లుగా అల్లం నాగరాజు, (వరంగల్), ఇ.యుగేందర్ రెడ్డి (జనగామ), చాడా రఘునాథరెడ్డి(భూపాలపల్లి)ని నియమించారు. మహబూబాబాద్ లోక్‌సభ కన్వీనర్‌గా ముసుకు శ్రీనివాస్‌రెడ్డి (కొత్తగూడెం), జాయింట్ కన్వీనర్లుగా సింగారపు సతీష్(మహబూబాబాద్), టి.దేవేందర్ రావు (ములుగు), జాటోత్ సంతోష్(వరంగల్)ను నియమించారు. అలాగే, భువనగిరి లోక్‌సభ కన్వీనర్‌గా బండారు లింగస్వామి(భువనగిరి), జాయింట్ కన్వీనర్లుగా కొంతం శ్రీనివాస్(జనగామ), నారాయణయాదవ్(రంగారెడ్డి రూరల్)ను నియమించారు. అదేవిధంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రభారీలను కూడా నియమించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీగా గొట్టల ఉమారాణి, మహబూబాబాద్ లోక్‌సభకు కట్ట సుధాకర్ రెడ్డి, భువనగిరి నియోజకవర్గ ప్రభారీగా చింతల రామచంద్రారెడ్డిని నియమించారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

ఖిలా వరంగల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ 37వ డివిజన్ ఖిలావరంగల్ పడమరకోట అమరవీరుల స్తూపం వద్ద సంఘం మండల అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఒకటో తేదీన వేతనాలు అందుకోలేని దౌర్భాగ్య స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టివేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమా



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భోగేశ్వర్, నాయకులు

వేశం ఏర్పాటు చేసి కొత్త వేతన సవరణ కమిటీ ద్వారా ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జె.స్వామి, పి.మనోజ్, యు.అశోక్, మానుపాటి వెంకటేశ్వర్లు, రమేశ్, బెల్లంకొండ రమేశ్, సోమేశ్వర్, ఆకుల కుమారస్వామి, పాలకుర్తి సత్యం, పరిపూర్ణాచారి, బాబురావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీరెడ్డినగర్‌లో చోరీ

ఖిలా వరంగల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌కు చెందిన గ్యారంపెల్లి అశోక్ కూరగాయల మార్కెట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లగా అశోక్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లాడు. పని ముగించుకుని సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికే ఇంటి తలుపు ధ్వంసం చేసి కనిపించింది. ఇంట్లోని బీరువా ధ్వంసం చేసి మూడు తులాల బంగారం, రూ.15వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.